కథ

''హాయ్ సూర్యం.. పరీక్ష ఎలా రాశావు?'' బియస్సీ ఆఖరి పరీక్ష రాసి బయటికి వస్తున్న సూర్యాన్ని అడిగింది శ్రావణి.

''ఫర్వాలేదు. డిగ్రీ గట్టెక్కుతుందనే నమ్ముతున్నాను'' భుజాలు ఎగరేసి అన్నాడు.

''నీ సంగతి ఏమిటి?'' అమర్‌తో కలిసి వచ్చిన రాధిక ప్రశ్నించింది.

''సేమ్ ఆన్సర్. అయినా చదివి ఎవర్ని ఉద్ధరించాలని?'' నిర్లక్ష్యంగా అంది శ్రావణి.

''మీరిద్దరూ లక్కీ. నాకైతే పాస్ అవుతానన్న నమ్మకమే లేదు'' చెప్పాడు అమర్.

''నాకు క్లాస్ వస్తుందనుకుంటున్నాను'' వాళ్ళు అడక్కపోయినా చెప్పింది రాధిక.

# ఆశలు - ఆశయాలు

''నీకు క్లాస్ వచ్చినా, మేము ఫెయిల్ అయినా ఒకటే. మాకు చదివే ఇంట్రస్ట్ లేదు. మీ ఇంట్లో నిన్ను పై చదువులకు పంపించే ఉద్దేశ్యం లేదు. అందుకేగా మాకు అవకాశం ఉండీ, నీకు లేక ప్రొఫెషనల్ కోర్సులొదిలేసి ఈ ఆర్డినరీ డిగ్రీ చదువుతున్నాం'' హేళనగా అంది శ్రావణి. మౌనంగా ఉండిపోయింది రాధిక.

''పదండి. ఆఖరిసారి మన క్యాంటీన్ అమృతాన్ని త్రాగివద్దాం'' అన్నాడు అమర్.

క్యాంటీన్ నీళ్ల 'టీ'కి వాళ్ళు పెట్టుకున్న ముద్దు పేరు అమృతం. నలుగురూ తలో కప్పు తీసుకుని కాస్త దూరంగా ఒక చెట్టు క్రిందకి చేరారు.

''ఇక ఫ్యూచర్ ప్లాన్‌లేమిటి?'' ఒక చెట్టుకు జారబడి కూర్చుంటూ అడిగాడు సూర్యం.

''నువ్వే చెప్పు'' అతని ప్రక్కన కూర్చుని అంది శ్రావణి.

''మీకు తెలుసు. నాకు టెన్నిస్ అంటే ప్రాణం. కాలేజ్ లెవెల్లో ఏం సాధించినా నేషనల్, ఇంటర్నేషనల్ రేంజ్‌లో గ్రాండ్‌స్లామ్ సాధించాలన్నదే నా లక్ష్యం. మన పి.టి సార్ తనకి తెలిసిన స్పోర్ట్స్ క్లబ్‌లో నాకు మెంబర్‌షిప్ ఇప్పిస్తానన్నారు. ఒక్కసారి అవకాశం దొరికితే చాలు. ఐ విల్ రీచ్ మై గోల్'' దృఢంగా చెప్పాడు.

''నాకూ మంచి క్లాసికల్ సింగర్ కావాలని కోరిక. నాకున్న సంగీత పరిజ్ఞానాన్ని మరింత పెంచుకుని ఏదైనా సంస్థ ద్వారా ప్రోగ్రామ్స్ ఇస్తాను. ఏదో ఒకనాటికి మనదేశ ప్రముఖ గాయకుల లిస్ట్‌లో నా పేరూ చేరాలన్నదే నా ఆశయం'' కలల్లో తేలిపోతున్నట్లు చెప్పింది శ్రావణి.

''నీ సంగతి?'' అమర్‌ని ప్రశ్నించింది.

ఖాళీ కప్పు గడ్డిలో పడేసి వెనక్కి వాలి ఆకాశంలో తేలిపోతున్న మబ్బులను చూస్తూ- ''సృష్టిలో సౌందర్యాన్ని కుంచెలో పొదిగి దాన్ని రంగులలో అద్ది తెల్లని కాన్వాస్‌పై ఆవిష్కరించగలిగే వరం భగవంతుడు నాకు ఇచ్చాడు. నాకు అండగా నిలిచేందుకు పెద్దవాళ్ళు లేరు. కొద్దోగొప్పో ఆస్తి ఉంది. అది అమ్మి నాలోని చిత్రకారుడికి జీవం పోసేందుకు శాంతినికేతన్‌లో చేరతాను. ఒక్కసారి నేనా ఏడువర్ణాల రెక్కల గుర్రాన్ని ఎక్కితే చాలు. లియోనార్డో, పికాసో, హుస్సేన్, అమర్...ఇలా చెప్పుకుంటారు రేపటితరం చిత్రకారులు తమ గురువుల గురించి'' ఉద్వేగంగా చెప్పాడు.

''నువ్వేం సాధించదలచుకున్నావని రాధికను అడగడం శుద్ధవేస్ట్. నేను చెబుతున్నాగా? వాళ్ళ నాన్న తెచ్చిన గుమస్తాని చేసుకుని ఏడాదికో బిడ్డను కంటూ, మొగుడ్ని సాధించడమే దాని లక్ష్యం. ఏం రాధీ?'' వెక్కిరిస్తున్నట్లు అంది శ్రావణి.

రాధిక నవ్వేసింది. ''నిజమే. మా ఇంటి పరిస్థితుల్ని బట్టి నేను ఎలాంటి ఆశలు ఏర్పరచుకోలేదు. పెద్దవాళ్ళు నిర్ణయించి చేసేది ఏదైనా నాకు ఆమోదమే. బట్ మీరంతా మీ ఆశయాలు సాధించాలని మనసారా కోరుకుంటున్నాను'' అని లేచి తన కప్పులతోపాటు వాళ్ల కప్పులు కూడా తీసుకుని క్యాంటిన్‌కేసి నడిచింది.

''ఈ ప్రపంచంలో కొందరు ఇదిగో ఇలాగే ఏ ఆశయం లేకుండా బ్రతికేస్తారు'' చిరాగ్గా అంది.

''పోన్లే శ్రావణీ. రాధిక ఇంటి ఆర్థికస్థితి మనకు తెలుసు. ఏజ్ ఏ ఫ్రెండ్.. తను ఎక్కడున్నా సుఖంగా ఉంటేచాలు'' మనస్ఫూర్తిగా అన్నాడు సూర్యం. అతన్ని సమర్థించాడు అమర్.

'మాలిన్యాలు, మనోవికారాలు లేని నా నిజమైన నేస్తాల కోరికలు నెరవేరేలా చూడు స్వామీ' వాళ్ళ మాటలు వినిపించిన రాధిక మనసులోనే దైవాన్ని కోరుకుంది.

★ ★ ★

''రాధీ! మీ కాలేజ్‌వాళ్ళు ఓల్డ్ స్టూడెంట్స్ మీట్ పెడుతున్నారు వెళ్లకూడదూ?'' ఉదయాన్నే పేపర్ చూస్తున్న మాధవరావు అడిగాడు.

''రాజమండ్రి అంటే చాలా దూరం. కనీసం రెండురోజులైనా లీవ్ పెట్టాలి. అదీకాక మీకు పిల్లలకి ఇబ్బంది. వద్దులెద్దురూ'' జడల్లుకుంటూ అంది రాధిక.

''మాకేం ఇబ్బందిలేదు. రెండు రోజులేగా వెళ్లిరా! పైగా నీ బెస్ట్‌ఫ్రెండ్స్ నుండి పదేళ్లుగా ఎలాంటి కమ్యూనికేషన్ లేదని తరచూ బాధపడుతుంటావుగా! కనీసం ఒకరిద్దరు వచ్చినా మీరు మళ్ళీ కలవచ్చు. ఓల్డ్ ఫ్రెండ్స్‌ని కలిసే గోల్డెన్ ఛాన్స్. మరి నీ ఇష్టం''

ఓల్డ్‌ఫ్రెండ్స్‌ని కలిసే ఛాన్స్ అన్నమాట మనసుని తాకింది. 'ఎలా ఉన్నారో సూర్యం, శ్రావణి, అమర్. ఆరోజు తరువాత మళ్లీ కలవనేలేదు. తప్పకుండా వెళ్ళాలి' అనుకుంది.

★ ★ ★

కాలం మనిషిలో శారీరకంగా ఎంత మార్పు తెస్తుందో తన మిత్రులని చూశాకా బాగా అర్థం అయ్యింది రాధికకి. కాలేజీలో హీరోలా ఉండే సూర్యం బట్టతల, కళ్లజోడు, పొట్టమీదకి జారిన ప్యాంట్‌తో ముప్ఫై ఏళ్లకే నలభై ఏళ్ళ వ్యక్తిలా అను

ఈలోగా మా బావ ఫారిన్ నుండి దిగాడు. ఆలస్యం చేస్తే డాక్టర్ అల్లుడు జారిపోతాడనే భయంతో సంగీతం పెళ్ళయినా కొనసాగించవచ్చుని నన్ను బలవంతం పెట్టి చేసేశారు. అప్పట్లో నాకూ పెళ్ళి సంగీతానికి అడ్డు అనే ఫీలింగ్ కలగలేదు. కానీ పెళ్ళయిన వెంటనే వేవిళ్ళు, పిల్లలు వాళ్ల ఆలనా పాలనా వీటికి తోడు డాక్టర్‌గారి భార్యగా సంఘంలో పేరు, మహిళామండలి సభ్యత్వాలు, వీటన్నింటికీ నా ఆశయం సంగతే మర్చిపోయాను. ఆమధ్య ఎప్పుడో గుర్తొచ్చి పాడదామని గొంతు విప్పేసరికి మా ఆయన, పిల్లలు వద్దని చేతులు జోడించేశారు. దాంతో పూర్తిగా వదిలేశాను'' పేలవంగా నవ్వింది.

''ఏం అమర్ నీ కోరికను కూడా పెళ్ళి, బాధ్యతలే చంపేశాయా?'' సూటిగా అడిగింది.

ఒక్క నిముషం మౌనంగా ఉన్న అమర్ వచ్చి వీళ్ళ ప్రక్కన కూర్చుని పెదవి విప్పాడు. ''లేదు. నా కుంచె ఆగిపోలేదు. అది ఇప్పుడూ బొమ్మలు గీస్తోంది. కాకపోతే దానిలో జీవం చచ్చిపోయింది''

''అంటే? అర్థంకాలేదు'' అన్నాడు సూర్యం.

''నా ఆస్తి కాస్తా నేను శాంతినికేతన్‌లో చేరక ముందే హరించుకుపోయింది. పెద్ద ఉద్యోగాలకు తగిన చదువులేదు. తప్పనిసరిగా నాకొచ్చిన విద్యతోనే ఉపాధి వెదుక్కోవాల్సి వచ్చింది. ముంబై వెళ్ళి ఒక టెక్స్‌టైల్ కంపెనీలో ఆర్టిస్ట్‌గా చేరాను. లేటెస్ట్ ఫ్యాషన్స్ కోసం వాళ్ళ ఫ్యాషన్ డిజైనర్ ఊహలకు తగ్గట్టుగా నేను బొమ్మలు గీసి ఇవ్వాలి. ఎన్నిసార్లు గీసినా అవే అరకొర అర్ధనగ్నపు డ్రెస్సుల సుందరుల సౌందర్యాలు. మనసు స్పందిస్తేనేగానీ సౌందర్యాన్ని ఆవిష్కరించలేని బలహీనత ఆర్టిస్ట్‌ది. రొటీన్ జీవితంలో స్పందించే అద్భుతాలేముంటాయి. ఎప్పుడైనా కాస్త స్పందన కలిగినా పగలంతా వేళ్ళు పుళ్ళయ్యేలా ఏదో ఒకటి గీసే నాకు మళ్ళీ ఇంటికొచ్చి కుంచెపట్టుకునే ఓపిక ఉండదు. పోనీ ఈ వృత్తి మానేయడానికి ఇది తప్ప నాకు మరో పని చేతకాదు. ఒక రకంగా నాకు నా మీదే ఇంట్రెస్ట్ పోయింది. అసలు ఇక్కడికి రాకూడదనే అనుకున్నాను. కానీ మీరైనా మీ గోల్ రీచ్ అయి ఉంటే మీలో నన్ను చూసుకుని తృప్తి పడదామని వచ్చాను. కానీ ఇప్పుడు మీకన్నా నేనే బెటర్ అన్పిస్తోంది'' నిర్వేదంగా అన్నాడు.

''ఊహూ! మీకన్నా నేనే బెటర్'' అంది రాధిక.

'ఎలా?' అన్నట్లు చూశారు ముగ్గురూ.

''ఇరవై ఏళ్ళ వయసులో నాకు ఏ ఆశయాలు లేవు. నా మధ్యతరగతి ఆర్థికస్థితి అందుకు సహకరించలేదు. శ్రావణి అన్నట్లు డిగ్రీ అయిన ఏడాదిలోపే మా నాన్న ఓ గుమస్తాతో నా పెళ్ళి చేసేశాడు. మా స్థాయికి తగ్గట్టు ఇద్దరు పిల్లల్ని కన్నాం. పిల్లలతో పాటూ బాధ్యతలు పెరిగాయి. చిన్నచిన్న ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ పి.జి చేసి బి.ఇడి చేశాను. అదృష్టం, కష్టం వృధా పోలేదు. ఉస్మానియా కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా నాకు ఉద్యోగం వచ్చింది. రెండేళ్లుగా లెక్చరర్‌గా చేస్తున్నాను. ఇదో గొప్ప విజయమని నేనను. కానీ నాకు అందివచ్చిన అవకాశాలను వినియోగించుకున్నాను. నా స్వశక్తితో నా సొంత గుర్తింపు తెచ్చుకున్నాను. అది నాకు సంతోషం. నేను చెప్పేది ఒక్కటే. పెళ్ళి, బాధ్యతలు, జీవితంలో సహజమే కానీ ఇవేవీ లక్ష్యానికి ఆటంకాలని నేను అనుకోను. ఎందుకంటే మీ ఆశయసాధనకు ఆటంకాలైన పెళ్ళి, బాధ్యతలే నన్ను జీవితంలో ఎదిగేందుకు ప్రోత్సహించాయి. రొటీన లైఫ్‌లోనే రోజూ కొత్త సంతోషాన్ని, ఉత్సాహాన్ని తెచ్చుకునే అవకాశం కలిగింది'' అంటూ ఆగింది రాధిక.

''కంగ్రాట్స్. మేము పరిస్థితులకు లొంగిపోయి ఓడిపోయాం. నువ్వు ఆ పరిస్థితులను అనుకూలంగా మలచుకుని విజేతవయ్యావు'' అభినందనగా అన్నాడు సూర్యం.

అతనితో ఏకీభవిస్తూ ముగ్గురు చప్పట్లు కొట్టసాగారు.

''స్టాపిట్'' ఇబ్బందిగా అంది రాధిక. ''నాకేం సంతోషంగా లేదు'' అసహనంగా అంది మళ్ళీ.

వాతావరణం నిశ్శబ్దంగా మారిపోయింది.

''నన్ను గొప్పగా అభినందిస్తున్నారు. మీరెందుకు పరిస్థితుల్ని ఎదిరించలేకపోయారు. ఏం సూర్యం.. నీ సంగతి చూడు. కొన్నాళ్ళు నిన్ను బాధ్యతలు లొంగదీసి ఉండవచ్చు. కానీ తరువాతైనా కనీసం వారానికి ఒక్కరోజైనా నువ్వు టెన్నిస్ ఆడుతూ ఉంటే లేదా నీ టాలెంట్‌తో కొత్త వాళ్ళని ఎంకరేజ్ చేసి ఉంటే నీలోని క్రీడాకారుడు ఇంతగా వేదనపడి ఉండేవాడు కాదుగా!'' అడిగింది.

సూర్యం ఉలిక్కిపడ్డట్టు చూశాడు.

''శ్రావణి కూడా అంతే..'' అని ఆమె వైపు తిరిగి ''నిజంగా నీకు సంగీతం పట్ల ఆసక్తి ఉంటే నీ విలువైన కాలాన్ని మహిళా సంఘాలు, పోసుకోలు కబుర్లకి వ్యర్థం చేసే బదులు మర్చిపోయిన గానాన్ని తిరిగి నేర్చుకునేందుకు వినియోగిస్తే కొంతైనా నీ లక్ష్యాన్ని చేరుకునేదానివి అవునా?'' శ్రావణి సమాధానం చెప్పలేనట్లు ఉండిపోయింది.

''నువ్వు మరీ ఫూల్‌లా మాట్లాడుతున్నావు అమర్. నీకు చేసే ఉద్యోగం ఇష్టం లేదు అంటే కష్టపడి డిగ్రీ పూర్తిచేసుకుని మరో మంచి ఉద్యోగం వెతుక్కోవాలి. అలా చెయ్యలేను అనుకుంటే ఏడాదికో పదిరోజులో, నెలరోజులో సెలవు పెట్టి నీ రొటీన్‌కి భిన్నంగా ఏ ఏకాంత ప్రదేశాలకో వెళ్ళి నీ ఊహలకి ఊపిరి పోసి ఉంటే ఈపాటికి నీ ఆశయం ఎప్పుడో నెరవేరేది కాదంటావా?'' సూటిగా ప్రశ్నించింది.

''నిజమే! నాకీ అలోచన రాలేదు'' ఒప్పుకుంటున్నట్లు అన్నాడు.

''నా స్నేహితులుగా మీరు నేను చెప్పిన ఈ విషయాన్ని ఆలోచించండి. వీలైనంతవరకూ ఆచరించండి. అప్పుడు మీరు ఇచ్చిన అభినందనలు నాకు ఆనందాన్ని ఇస్తాయి. ఇరవై ఏళ్ళ వరకూ యువత ఏదో సాధించాలని కలలు కంటుంది. పాతికేళ్లకి ఆ విషయం మరుపుకొస్తుంది. ముప్పై ఏళ్లకి కథ ముగిసిపోతుంది. యవ్వనమంటే ఇదే అనే సిద్ధాంతాన్ని రుజువు చెయ్యకండి ప్లీజ్'' వేదనగా అంది.

దూరంగా ఫంక్షన్ అయిపోయినట్లు జనగణమన వినిపిస్తోంది.

ముందుగా తేరుకున్న సూర్యం అన్నాడు ''థాంక్స్ రాధికా! యూ ఆర్ ఎ రియల్ ఫ్రెండ్. నువ్వన్నది నిజమే. జీవితాన్ని ఒక కోణం నుంచే చూసి మా చేతకానితనానికి ఏవో కారణాలు కల్పించుకున్నాం. ఇకనైనా మా ఆశయాలు నెరవేరేందుకు కృషిచేస్తాం. నువ్వు చెప్పిన పద్ధతులు ఆచరణలో పెట్టేందుకు కృషి చేస్తాం. కనీసం ఈ జనరేషన్‌కైనా మా కళా స్ఫూర్తినందిస్తాం'' అన్నాడు.

''మొత్తానికి లెక్చరర్‌ని అనిపించుకున్నావే రాధీ! తప్పకుండా నువ్వు చెప్పినట్లు చేస్తాను. ఇట్స్ ఎ ప్రామిస్'' అభిమానంగా అంది శ్రావణి.

''ఐ టూ మేడమ్'' హుషారుగా అన్నాడు అమర్.

రాధిక కళ్లలో చిరుతడి, పెదాలపై చిరునవ్వు హరివిల్లులా మెరిసాయి.

★

